
కాంక్రీట్ జంగల్ అనబడే మహానగరాలు సైతం క్యాస్ట్ డిస్క్రిమినేషన్‌కు మినహాయింపు కాదు. అయితే ఇది పై కులాలకే పరిమితం కాదు. శూద్ర, అతిశూద్ర కులాల్లోను తమ కంటే కిందివాళ్లను చూసినపుడు అది బయటపడుతుంది. అలాంటి ఓ ఘటన కళ్ల ముందు జరిగినపుడు కలిగిన ఆవేదన నుండి రూపొందిన కథ...

డా॥ పసునూరి రవీందర్

4

# అయినా మనిషి మారలేదు

అక్బర్





పట్నంలో ఇల్లు కిరాయికి దొరకడం మాటలు కాదు.

గల్లీలు గల్లీలన్నీ జల్లెడ పట్టాలి.

టులెట్ బోర్డు కనిపించిన యింటికల్లా వెళ్లి ఆశతో ఆరా తీయాలి.

అయినా అనేకసార్లు నిరాశతో తిరిగిరాక తప్పదు.

మీరు ఎవరు? ఏం చేస్తుంటారు? మొఖం మీదే ప్రశ్నలు.

'బ్యాచిలర్స్ అయితే ఇవ్వం,' అని కొందరు ఓనర్లు చెప్తే, ఇంకొందరేమో 'బ్యాచిలర్స్‌కే' ఇస్తామంటారు.

వీటన్నింటికంటే ముఖ్యమైంది వెజిటేరియన్నా, నాన్ వెజ్‌టే రియన్నా?? గొడవ!

'నాన్ వెజ్ తినెటోల్లుకైతే ఇల్లివ్వం!' అంటారు. ఈ దేశంల నాన్ వెజ్ తినేవాళ్లెవరు మరి?! ఏ కులపోల్లు? మరి వాళ్లంత పట్నాలల్లో ఉండడానికి పనికిరారా??

'ఏందో ఏమో పట్నంల రకరకాల మనుషులు- రకరకాల కట్టుబాట్లు,' అనుకొని తనలో తానే నవ్వుకున్నాడు కర్ణాకర్.

అలా పట్నంలో తప్పిపోయిన పిల్లాడిలా వీధులన్నీ గాలి స్తున్నాడు.

అసలే ఓపక్క ఇప్పుడున్న ఇంటి ఓనరు, కర్ణాకర్‌ను రెండు నెలల క్రితమే ఖాళీ చెయ్యమన్నాడు.

అది మొత్తం నాలుగు పోర్షన్‌ల యిల్లు. పై పోర్షన్‌లో ఓనర్‌వాళ్ల చుట్టాలుంటారు.

వాళ్లు పైనుండడమే కాదు. పై కులపోల్లు కూడా. మొదట్లో మంచిగానే ఉన్నారు. పై పోర్షన్ ముసలావిడ అప్పుడప్పుడు కాలక్షేపం కోసం వచ్చి, టీ తాగుతూ కర్ణాకర్ భార్య అనితతో లోకం మీది విషయా లన్నీ మాట్లాడుతుండేది.

అలా కర్ణాకర్ ఉండే పోర్షన్‌లో గోడకున్న అంబేద్కర్ బొమ్మ చూసి, "మీరేమిట్లు?" అని అడగకుండనే కులం తెలుసుకున్నది.

అప్పటి నుండి మర్యాదను, గౌరవాన్ని సగానికి సగం తగ్గించి, మాకంటె మీరు తక్కువ వారన్నట్టు మాట్లాడ్డం మొదలుపెట్టింది.

ఆకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పును కర్ణాకర్ కూడా గమనించాడు.

పైగా మెయింటెనెన్స్ దగ్గరో, మరో విషయం దగ్గరో కర్ణాకర్ ఏదైనా అడిగితే, 'మమ్మల్నే అడిగే వాడయ్యాడా?!' అన్నట్టు ఓనర్‌కు లేనిపోనివి చెప్పి, కర్ణాకర్ మీద ఒకలాంటి ఆధిపత్యం నెరిపేవాళ్లు.

ఇక ఇదంత కాదనుకొని కర్ణాకర్ ఇల్లు ఖాళీ చేయడానికి సిద్ధమయ్యాడు.

కులపట్టింపులు లేకుండా మనిషిని, మనిషిగా గౌరవించే ఓనరుండే యిల్లు కావాలనుకున్నాడు. అలాంటి ఓనరుంటాడా? ఏమో వెతకాలి. అసలు ఓనరేలేని యిల్లు దొరికితే మరింత సంతోషం అనుకున్నాడు. ఓనరేలేని అంటే, ఓనరు మరెక్కడో ఉంటూ, అద్దె మాత్రం అకౌంట్లో వెయ్యమనే బాపతు ఇంటికోసం వెతుకుతున్నాడు.

కాని, వెంటనే అలాంటి యిల్లు దొరకకపోవడంతో, వచ్చే నెల ఖాళీ చేస్తాం, ఈ ఒక్క నెల ఆగండని పాత ఓనర్‌కి కాల్ చేసి రిక్వెస్ట్ చేశాడు. అలా ఒక నెల ఆగిన ఓనర్‌ను, యిల్లు దొరకకపోయేసరికి మరో నెల కూడా కాస్త ఓపిక పట్టండి సార్ అని సముదాయించాడు కర్ణాకర్.

అప్పటికి, ఈ బద్ధకం చూసి కర్ణాకర్ భార్య, గత కొన్ని రోజులుగా తొందర పెడుతూనే ఉంది.

"నీ బిజీ సల్లగుండ, ఓనర్ తిట్టి సామాన్లు బయిటేసేదాక, నువ్ యిల్లు చూసెటట్టు లేవుగని," అని తిడుతూనే ఉంది. ఆ తిట్లు తప్పించుకోవడానికి కర్ణాకర్ అనిత ముందు మేకపోతు గాంభీర్యంతో భారీ బిల్డప్ ఇచ్చాడు.

"పిచ్చిదానా ఈ రోజుల్లో ఇల్లు వెతకడం పెద్ద పనే కాదు! టీ షాప్స్ దగ్గర, బస్టాప్స్ దగ్గర ఓనర్లే టులెట్ అని పోస్టర్‌లు అంటించి, అందులో ఫోన్ నెంబర్లు ఇస్తున్నారు. జస్ట్ మనం ఫోన్ చేస్తే చాలు, యిల్లు దొరికినట్టే. అంతే. దానికి ఇంత పరేషాన్ ఎందుకైతున్నవ్?" అని ఫోజులు కొట్టాడు.

దెబ్బకు అనిత సైలెంట్ అయ్యింది.

ఇదే అవకాశమన్నట్టు కర్ణాకర్ మరింత రెచ్చిపోయాడు.

"నీకు తెలుసో లేదో, ఇల్లు రెంటుకు కావాలంటే ఇప్పుడు ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకోవచ్చు. అంతా నేను చూసుకుంటా. నువ్ ఇలాగే సైలెంట్‌గా ఉండు, అనవసరంగా ఇల్లు పీకి పందిరెయ్యకు," అని అనిత నోరు మూయించాడు.

కాని ఇప్పుడు యిల్లు కోసం ఆగమాగం తిరుగుతున్నప్పుడు తెలుస్తున్నది అసలు కష్టం. భార్య నోరు మూయించినంత ఈజీకాదు యిల్లు వెతకడం.

మరోవైపు వాయిదాల మీద వాయిదాలు దాటేస్తే, ఆఖరికి ఓనరుకు కోప మొచ్చింది. నాలుగురోజుల్లో ఖాళీ చేయాల్సిందేనని వార్నింగ్ ఇచ్చిన తర్వాతగాని కర్ణాకర్ ఇలా వీథుల వెంట పడలేదు.

కొబ్బరి చెట్టున్న ఓ ఇంటి ముందు టులెట్ అని రాసి కనిపిస్తే తప్పిపోయిన పిల్లాడు దొరికినట్టు సంబరపడ్డాడు. కొండంత ఆశతో బైకు ఆపాడు. తాను ఆపాడో, బైకు దానంతటది అదే ఆగిందో తెలియదు. గేటు తీసుకొని లోపలికెళ్లి కాలింగ్ బెల్ కొట్టాడు.

ఈసారి ఓనరయ్య కాకుండా, ఓనరమ్మ తలుపు తీసింది. తీసి తియ్యడంతోటే, కర్ణాకర్ ముఖం చూడగానే విరుచుకుపడ్డది.

"గడ్డమున్నదంటే మీరు ముస్లింసా? ముస్లింసుకైతే ఇల్లివ్వం!" అని తలుపేసు కున్నది.

"మేం ముస్లింసు కాదు మొర్రో!" అని చెప్పబోయాడు కర్ణాకర్. ఆవిడ వింటేనా...!

"సర్లే ఏం చేస్తం?!" అనుకున్నాడు.

అందుకే ఓనర్‌లేని ఇండ్లంటే కర్ణాకర్‌కు, తనకు తెలియకుండానే ఓ ఇష్టం ఏర్పడ్డది. ఓనర్ లేకపోతే ఏ గొడవ ఉండదు. ఉంటే గింటే, పక్కపోర్షనోళ్లతోటే, పై పోర్షనోళ్లతోటే!!

ఇలాంటి పరేషాన్‌ల అనిత కాల్. ఉసూరుమంటూ లిఫ్ట్ చేశాడు కర్ణాకర్. యిల్లు దొరికి ఉండదన్న నమ్మకంతోనే అడిగింది. "కరుణా దొరికిందా...??" శాంతంగానే అడిగింది.

ఇన్ని రోజులు ఫోజులు కొట్టినందుకు, ఇప్పుడు ఇల్లు దొరకనందుకు అనిత ముందు పరువు పోయేటట్టు ఉందని, అనితను మళ్లీ దబాయించే పని పెట్టుకున్నాడు.

"వెతుకుతున్న. ఉట్టిగనే దొరుకుతదా. టైం పడుతదమ్మా, అన్నీ కూర్చున్న కాడికే రావు," కసురుకున్నాడు.

ఆ మాటకు, "అయ్యగారికి ఎండదెబ్బ బాగానే తాకినట్టుందిగని, ముందు ఇంటికి రా. మన పక్క స్ట్రీట్‌లో ఓ యిల్లు ఉన్నదంటే, నేను నా ఫ్రెండ్ సుజాతతో వెళ్లి చూసొచ్చిన. బాగుంది. తమరొకసారి చూసి, మెచ్చితే కన్‌ఫర్మ్ చేసెయ్యొచ్చు," అని ఒక సెటైర్ విసిరింది.

"నిజమా..." అంటూనే పక్క కాలనీ నుండి ఐదునిముషాల్లో ఆగమేఘాల మీద ఇంటికొచ్చాడు.

అనితను చూడగానే ఒకలాంటి చిరునవ్వు నవ్వి, పరువు కాపాడుకునే ప్రయత్నం చేశాడు.

"సరేగని ఏ యిల్లు, నువ్ చూసొచ్చింది? ఓనరు ఆ యింట్లోనే ఉంటడా, లేక ఎక్కడో ఉంటూ, రెంటు డబ్బుల కోసం మాత్రమే వచ్చిపోతుంటడా? రూములు పెద్దగ ఉన్నయా? వాటర్ ప్రాబ్లమైతే లేదు కదా?!" ప్రశ్నల మీద ప్రశ్నలేశాడు.

అనిత మాత్రం ఛాయ్ పట్టుకొచ్చి, "ముందు తాగు, చెప్తానుగని," అని కర్ణాకర్‌కు ఇచ్చి, సోఫాలో కూర్చున్నది.

"ఏం కులపోల్లదట ఆ యిల్లు??" అని కుర్చీలో కూలబడుతూ అన్నాడు కర్ణాకర్.

ఆ మాటకు అనిత కొంచెం షాకైంది.

"అదేంది అట్లడిగినవ్. రెంటుకు ఉండెటోళ్లు కాదోయ్ కులం అడగాల్సింది, ఓనర్లు అడుగుతరు."

"సరేగని చెప్పు. పుసుక్కున మళ్ల ఏ బాపనోళ్లదో అయితే, మనం రోజూ నటించాల్సి వస్తది," అన్నడు కర్ణాకర్.

"ఏమో నాకెమెరుక కనుక్కోవాలె," అన్నది నవ్వుతూ అనిత.

ఇద్దరూ వెళ్లి చూస్తే, ఓనరు ఇప్పటివరకు చూసిన ఓనర్లలా లేడు. చాలా ప్రేమతో, మర్యాదతో ఇల్లంతా చూపించాడు.

కొత్త యిల్లు. ఇంకా కొంత పని నడుస్తూనే ఉంది. కాకుంటే గ్రౌండ్‌ఫ్లోర్ తన కోసం రెడీ చేసుకున్నాడు. మిగిలిన మూడు ఫ్లోర్‌లల్ల ఫస్ట్ ఫ్లోర్ పని కంప్లీట్ అయి ఉన్నది. ఆ ఫస్ట్ ఫ్లోరే కర్ణాకర్‌కు చూపిస్తున్నాడు. రూములు కొంచెం చిన్నగానే ఉన్నా, వాటర్‌కు ప్రాబ్లమైతే లేదు. ఇక వెనకాముందు ఆలోచించకుండా 'ఓకే' చెప్పి, రెండు నెలల రెంట్ అడ్వాన్స్ ఓనర్ చేతిలోపెట్టి, సంచులు, సామాన్ల షిఫ్టింగ్ పని పెట్టు కున్నారు కర్ణాకర్ దంపతులు.

❖

యిల్లు దొరుకడమే చాలా కష్టమంటే, ఈ సామాన్లన్ని మోసుకుపోవడం మరో కష్టం. అన్ని ప్యాక్ చేయాలి. కొత్తింట్లో అన్ని సర్దుకోవాలంటే, ఖచ్చితంగా వారం పైనే పడుతది. ఇద్దరు పనివాళ్లను పెట్టుకున్నా సరే, భార్యభర్తలిద్దరూ కష్టపడక తప్పలేదు.

అప్పటికే ఇంటికోసం సుడిగాలి పర్యటనలు చేసొచ్చిన కర్ణాకర్‌కు మాత్రం, సామాన్ల షిఫ్టింగ్‌తో మరోసారి చుక్కలు కనిపించాయి. పిల్లి తన పిల్లలను నోట కరుచుకొని ఏడిండ్లు తిరుగుతున్నట్టుంది తనకు.

ముక్కులకు కర్చీప్‌లు కట్టుకొని సామాన్లు సదురుకుంటూ, "అందుకే సొంతిల్లు కట్టుకునే దాకా, ఎక్కువ సామాన్లు కొనొద్దే అంటే విన్నవా?! ఇప్పుడు చూడు ఎంత కష్టపడాల్సి వస్తున్నదో," అని సామాన్లు మోసుకొచ్చిన బాధంతా ఒక్కసారిగ చూపెట్టాడు కర్ణాకర్. అనితేం తక్కువ తినలేదు.

"ఔను మరి! అన్ని నేనే కొన్నట్టు చెప్తున్నవ్. నువ్ నీకిష్టమై కొన్నయి లేవా?"అని సోఫా, కుర్చీలను చూపిస్తూ ఎదురుదాడికి దిగింది అనిత. సమాధానం కొంచెం బలంగా ఉండాలనుకున్నదేమో, ప్లాస్టిక్ కుర్చీలను ఎత్తేసి మరీ చెప్పింది.

దెబ్బకు నోరు మూసుకున్నాడు కర్ణాకర్. పరిస్థితి బాగోలేనపుడు దండయాత్రలు అంత మంచివి కాదనుకొని సామాన్లు సర్దే పనిలో పడ్డాడు. ఇంకొంచెం చర్చ ముందుకు సాగితే 'సొంతిల్లు పోరు' మొదలవుతుందని ముందే గ్రహించాడు.

ఇలా కాలం గడిచిపోతున్నది.

ఇలాంటి సమయంలో ఓరోజు కర్ణాకర్‌కు ఓ పేద్ద డౌటొచ్చింది.

'ఇంతకు ఓనర్‌వాళ్లది ఏ కులమబ్బా? కొత్తగా రెంటుకొచ్చిన మమ్మల్ని వెజ్‌టేరియన్సా, నాన్ వెజ్‌టేరియన్సా అనే పేరుతో మా కులం ఎందుకు అడుగలేదు? అసలు సిటీలో యిలాంటి మంచోళ్లు కూడా ఉంటరా??'

ఈ ప్రశ్నలను అనిత దగ్గర ప్రస్తావించాడు కూడా.

అనిత మాత్రం, "నీదో పిచ్చి, ప్రతీసారి కులం కులమని భయపడుతవ్! కొంచెం ఓపిక పడితే, ఎవరి కులమైన బయిటపడ్తది. ఆగరాదు," అని వంటపనిలో మునిగింది.

కర్ణాకరంత కాకపోయినా, అనిత కూడా కులం చేత అవమానాలు పడ్డదే. అయినా ఈ మనుషులింతే మారరు అనే నిర్ధారణకు వచ్చి, పట్టించుకునేది కాదు.

❖

ఫ్రెండ్స్‌ను కలువడానికో, హెయిర్ కట్ కోసం కాలనీలో ఉన్న సెలూన్‌కో పోతే, కర్ణాకర్ ఇల్లు మారిన విషయం అడుగుతున్నారు.

"ఎక్కడికి షిఫ్ట్ అయ్యిన్రు?"అని ఒకరిద్దరు కాలనీ వాళ్లు కూడా ఆరా తీశారు.

"పక్క గల్లీకే," అని అందరికి చెప్తున్నాడు కర్ణాకర్.

ఆ పక్క వీధి బాగా తెలిసిన కాలనీవాళ్లు ఎవరిల్లు? ఓనరు పేరేంటని అడిగారు.

“బిక్షపతి,” అని కర్ణాకర్ చెప్పాడో లేదో, అందరూ తల గోక్కున్నారు.

బిక్షపతి ఎవరబ్బా అనుకున్నారు. కాసేపటికి ఎవరికో లైటెలిగింది. “చాకలి బుచ్చయ్యనా ఏంది?” అన్నారు.

ఓహో బిక్షపతి పేరు కింది కులం కారణంగా బుచ్చయ్యగా మారిందా అనుకున్నాడు కర్ణాకర్. బుచ్చయ్య చాకలాయన కావడం వల్ల ఆయనను లైట్ తీసుకున్నారు కాలనీవాళ్లు.

కర్ణాకర్‌కు మాత్రం కొంచెం బరువు దిగింది. ఇన్ని రోజులుగా ఉన్న సందేహం తీరింది. ఓనర్ కులం తెలిసొచ్చింది. అక్కడే ఉన్న ఓ పెద్దమనిషి బుచ్చయ్య చరిత్ర చిట్టా విప్పుతున్నాడు.

“ఇంతకు ముందు బుచ్చయ్య, ఆయన భార్య బట్టలు ఉతికి, ఇస్త్రీ చేసెటోళ్లు. పొయిన సంవత్సరం వాళ్లకు ఆ హైవే పక్కనున్న జాగ అమ్మితే బొచ్చెడన్ని పైసలొచ్చినై. అట్లా ఈ కాలనీలనే కాదు, పక్క కాలనీలల్ల కూడా మరో రెండిండ్లు కట్టిండు బుచ్చయ్య. ఇండ్లు కట్టుడు షురూ జేసినంకా, కులం పనిని బంద్ పెట్టిండు,” అని బుచ్చయ్య చరిత్ర బ్రేక్ లేని సీరియల్‌లా చెప్పుకొచ్చాడు పనిపాటాలేని ఆ పెద్దమనిషి.

“అయినా వేలకు వేలు రెంటులొస్తుంటే మళ్ల బట్టలెందుకు పిండుతరు??” ఇక తన వంతన్నట్టు ఆ షాపు ఓనరైన మంగలి గొంతు కలిపాడు.

ఆ మాటల్లో బుచ్చయ్య ఎదుగుదల మీద లోకానికి లోలోపల ఉన్న అక్కసు అర్థమైంది కర్ణాకర్‌కు.

తనకు మాత్రం చాలా సంతోషంగా ఉంది. ఓనర్ కులం తెలిసిందని.

‘హమ్మయ్య. చాకలివాళ్లంటే మా దళితుల్లాగే గ్రామాల్లో బాగా అణిచివేతకు గురైనోళ్లు,’ అనుకున్నాడు. పైగా తన ఊరిలో చాకలి కుటుంబాలతో కర్ణాకర్ కుటుంబానికి మంచి సంబంధాలే ఉన్నాయి.

‘చిన్నాయిన, మామ,’ అంటూ వరుసలు పెట్టి పిలుచుకునే అలవాటు కూడా ఉంది.

ఇక కర్ణాకర్‌కు కొంచెం హుషారొచ్చింది.

అందుకేనా ఇంటి ఓనరు తన కులం అడుగలేదు! వెజ్, నాన్‌వెజ్ గోల లేదు! అసలు కులాన్నే పట్టించుకోలేదు.

ఏది ఏమైనా కింది కులాలోల్ల ప్రేమే వేరు. బుచ్చయ్య ప్రవర్తన కూడా అలాగే ఉండేది.

కొత్తింటికి ఇంకా కొనసాగుతున్న పనికి కర్ణాకర్‌నే సలహాలు అడిగేవాడు బుచ్చయ్య. బుచ్చయ్యకు చదువు లేకపోవడం, కర్ణాకర్ బాగా చదువుకున్నోడు కావడం వల్ల, ఇంటి బయట గోడలకి ఏ రంగు బాగుంటది, ఎక్కడెక్కడ నల్లాలు పెట్టిస్తే బాగుంటది? కర్ణాకర్‌నే అడిగేవాడు.

కర్ణాకర్‌కు ఒకలాంటి రిలీఫ్ ఉంది. కొందరు పెద్దకులపు ఓనర్లయితే, తన ఇంటిలో రెంటుకున్న కింది కులం వాళ్లను కనీసం మనుషులుగా చూడరు. బుచ్చయ్య మాత్రం వాళ్లలా కాదు. మనిషిని మనిషిగా చూసే మంచితనం బుచ్చయ్య సొంతం.

కర్ణాకర్ భార్య కూడా, ఓనర్ బుచ్చయ్య భార్యతో బాగానే కలిసిపోయింది.

ఓరోజు అనితను, "ఏమిటోళ్లు అనిత మీరు," అని అడిగింది బుచ్చయ్య భార్య సుశీలమ్మ.

మాదిగోళ్లమని చెప్పితే తనను ఎక్కడ తక్కువగ చూస్తరోనని, తెలివిగా, "క్రిష్టియన్సుము," అని చెప్పి తప్పించుకున్నదట అనిత.

ఓనరే కాదు, ఓనర్ భార్య కూడా అక్షరజ్ఞానం లేనోళ్లే. క్రిష్టియన్స్ అంటే అదేం కులమోనని, కులం జోలిని పెద్దగా పట్టించుకోలేదు బుచ్చయ్య, సుశీలమ్మ.

కర్ణాకర్ మాత్రం అదేదో తన యిల్లయినట్టు, బుచ్చయ్యతో పాటు, ఇంటిని మరింత సుందరంగా తయారుచేసే సలహాలు ఇస్తున్నాడు.

బుచ్చయ్యకు కూడా కర్ణాకర్ కలుపుగోలుతనం బాగా నచ్చింది.

ఆ ప్రేమతో తనకంటే చిన్నవాడైనా సరే, కర్ణాకర్‌ను 'కర్ణాకరన్నా,' అంటూ సంబోధిస్తూ మాట్లాడేవాడు బుచ్చయ్య.

❖

ఓరోజు పక్క వీధిలో ఎవరో చనిపోయారు.

చుట్టాలు, బంధువులు వచ్చాక హడావుడిగా శవాన్ని అంత్యక్రియలకు తీసుకు పోయారు.

చావు అయిపోయాక, అదే వీధిలో ఉండే వెంకటమ్మ హడావుడిగ బుచ్చయ్య ఇంటికొచ్చింది.

గ్రౌండ్ ఫ్లోర్ పోర్షన్‌లోకి హడావుడిగా వెళ్లింది.

బుచ్చయ్య భార్యను తీసుకొని వెళ్లిపోయింది.

బుచ్చయ్య భార్య అలా హడావుడిగా వెళ్లి, కొద్దిసేపటికి మళ్లీ తిరిగొచ్చింది.

కాని, వెళ్లేటపుడున్న ప్రశాంతత ఆమె ముఖంలో ఇప్పుడు లేదు. ఫస్ట్ ఫ్లోర్‌లోకెల్లి ఈ విషయాన్ని గమనించిన అనిత, మెట్లు దిగి, ఏం జరిగిందో తెలుసుకోవడానికి అంతే హడావుడిగా బుచ్చయ్య ఇంట్లకు వెళ్లింది.

అసలే అనిత ఇలాంటి విషయాల్లో టీవీలో బ్రేకింగ్ న్యూస్ కంటే ముందుండా లనుకుంటది. లోకం మీద ఏం జరిగినా వెంటనే తెలుసుకోవాలనుకుంటది. తెలుసు కునేదాక నిద్రపోదు.

"ఏమైందాంటీ? ఎట్లా చనిపోయాడట?" అని కొంచెం క్యూరియాసిటీతో అడిగింది.

"ఆ ఏమున్నది అనితా, హార్ట్ అటాకంట," అన్నది.

"ఔనా... మీరెందుకు వెంకటమ్మ ఆంటీతోటి అంత హడావుడిగ వెళ్లిను మరి?"

"ఏం చెప్పాలె అనిత?! ఇంతకు ముందంటే, ఎవరు చచ్చిపోయినా మేమే బట్టలుతికే వాళ్లం. ఇప్పుడు సొంతంగ యిల్లు కట్టుకొని బతుకుతున్నం. చావు బట్టలు పిండాలంటే పోయినా. మేం మారినా, ఈ కులంకట్టు మారది కదా! అట్లనే కొన్ని పైస లొస్తయని వెళ్లిన," అని దీర్ఘం తీసింది.

"మరేమైంది... ఆంటీ??" మరింత శ్రద్ధతో అడిగింది అనిత.

"ఏమైంది, బట్టలవరకైతే రెండొందలు ఇస్తామన్నరు. సరే అనుకున్న. ఇక ఇల్లు వాకిలి ఊడ్చి కడగాలంట...!!"అని వాపోయింది సుశీలమ్మ.

అనితకు కోపమొచ్చింది.

"అదేంది ఆంటీ, మీరు మూడంతస్తుల యిల్లు కట్టుకొని, ఈ పట్నంల ఇంత గౌరవంగా బతుకుతుంటే మళ్లీ మిమ్మల్ని ఇలాంటి పనులకు పిలవడం ఏంటి??" అని చిన్నపాటి కోపాన్ని వెలిబుచ్చింది అనిత.

"ఏం చెయ్యమంటవు అనిత? మేం మా కులం పని చేయడం లేదని తెలిసినా ఈ కాలనీ వాళ్లకు మాత్రం సాకలోల్లు అనంగనే మేమే గుర్తొస్తం," అని తన ఆవేదనంతా చెప్పుకొచ్చింది.

అనితకు కర్ణాకర్ యాదికొచ్చాడు. కర్ణాకర్ ముందు కులందేమున్నది అని ఆట పట్టించే తన మాటలు గుర్తొచ్చాయి. ఇప్పుడు ఈ పట్నంలో కూడా పట్టుపట్టి మరీ, చాకలివాళ్లతో చాకిరి చేయించుకుంటున్న తీరుకు అల్లాడిపోయింది.

"బాధ పడకు ఆంటీ... ఈ లోకం ఎప్పుడు ఇంతే. కింది కులపోల్లంటే లెక్కే లేదు," అని తన చుట్టాలనో, బంధువులనో ఓదార్చుతున్నట్టు ఓదార్చింది.

అంతలోనే ఓనరాంటి తేరుకొని తనను చావింటి పనికి పిలిచిన వెంకటమ్మను, వెంకటమ్మలాంటి పై కులపోల్లను తిట్లతో ఉతికి ఆరేయడం మొదలుపెట్టింది. 'ఇంతకాలం పడ్డ బాధంతా ఆంటీకి గుర్తొచ్చిందేమో,' అనుకున్నది అనిత.

"అట్లా కాదు అనిత, ఈ బలిసినోళ్లకు ఏం చెప్పాలె. మేం అంత నీచంగ కనపడ్తున్నమా, మా బట్టలుతికే పని వరకు, మాకు చెప్పాలె, చేస్తం! కాని, ఆ ఊడ్సుడు కడుగుడు మాకెందుకు చెప్పాలె? మేమేమన్న వాళ్లకు జీతగాళ్లమా?? అట్లా చేయించు కోవాలంటే మాదిగోళ్లను పిలిపించుకోని చేయించుకోవాలె. అది మాదిగోళ్ల పని! మాకు చెప్తరా?! మాదిగోళ్లకు చెప్పాలె!" అని చెడామడా తిట్టింది.

బుచ్చయ్య భార్య మాటలకు అనిత ఒక్కసారిగా షాకైంది.

తనేమో బుచ్చయ్య భార్య బాధను పంచుకుందామనుకుంది.

బుచ్చయ్య భార్యేమో మాదిగోళ్లు మనుషులే కానట్టు మాట్లాడుతోంది.

నీచమైన పనులు చేసేందుకే మాదిగోళ్లు ఉన్నట్టు మాట్లాడుతోంది.

ఆ టైంలో సుశీలమ్మ కూడా, పాత యింటి దొరసానమ్మ లెక్కనే కనిపించింది అనితకు.

ఈ విషయం తెలిసి కర్ణాకర్ మాత్రం కొంచెం ఆశ్చర్యపోయాడు. అయినా సుశీలమ్మది కాదు, మనుషుల్ని కులాలుగా విడదీసిన కనిపించని నిచ్చెనమెట్లదే ఈ తప్పు అనుకున్నాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*24 జనవరి 2016*

✻



పసునూరి రవీందర్ 8 జనవరి 1980న వరంగల్ జిల్లా శివనగర్‌లో జన్మించారు. వీరి మొదటి కథ **వలసపక్షులు** 2002లో ప్రజాశక్తి దిన పత్రికలో అచ్చయ్యింది. దాదాపు 30కి పైగా కథలు రాశారు. అవుటాఫ్ కవరేజ్ ఏరియా కథాసంపుటికి 2014లో 'కేంద్ర సాహిత్య అకాడమి యువపురస్కారం లభించింది.
***చిరునామా:*** ***ప్లాట్ నెం. 114, గుల్‌మొహర్ పార్క్ కాలనీ, శేరిలింగంపల్లి,***
***హైదరాబాద్-500019.***
***ఫోన్ : 7702648825 drpasunuri@gmail.com***